
GHMC hmda Growing Global TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

క్రైమ్ మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
శనివారం 31-07-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# మునుగోడులో విద్యకు పెద్దపీట



- విద్యకు పెద్దపీట వేస్తున్న ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రత్యేక కార్యాచరణ
- మోడల్ స్కూల్స్, కస్తూర్బా విద్యాలయాల సమస్యలపై సమగ్ర సమీక్షకు సిద్ధం
- మరమ్మత్తులు, నూతన భవనాల నిర్మాణం, మౌలిక వసతుల కల్పనపై అధికారులకు దిశానిర్దేశం ఇవ్వనున్న

**మునుగోడు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి, కొత్త ఊపు తీసుకొచ్చేలా ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చర్యలు ప్రారంభించినట్లు సమాచారం. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు, వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలను సమగ్రంగా గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.**

**నల్లగొండ నిఘా ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):**

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వాతావరణాన్ని కల్పించాలనే లక్ష్యంతో అధికారులు, విద్యాశాఖ సిబ్బందితో ప్రత్యేక సమీక్ష నిర్వహించేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. మునుగోడు నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ విద్యాసంస్థల్లో, శిథిలావస్థకు చేరిన భవనాలు, పైకప్పుల లీకేజీలు, తరగతి గదుల కొరత, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాల సమస్యలు ఉన్నట్లు గుర్తించిన ఎమ్మెల్యే, వీటిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిసింది. అవసరమైన చోట తక్షణ మరమ్మత్తులు చేపట్టడంతో పాటు, కొత్త భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, అధికారులను ఆదేశించనున్నారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలపైనే విశ్వాసం పెంచుకునేలా, అన్ని సౌకర్యాలు కల్పించాలన్నది ఎమ్మెల్యే లక్ష్యంగా కనిపిస్తోంది. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా ప్రైవేటు విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని, విద్యను ప్రభుత్వ పాఠశాలల్లోనే పొందేలా చర్యలు తీసుకోవాలని ఆయన భావిస్తున్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల భవిష్యత్తే రాష్ట్ర భవిష్యత్తని భావిస్తూ, విద్యారంగానికి ప్రాధాన్యం ఇవ్వడం అభినందనీయమని పలువురు అభిప్రాయపడుతున్నారు. మోడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక నివేదికను సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించే అవకాశం ఉంది. వసతి, భోజనం, భద్రత, పరిశుభ్రత, తాగునీరు, విద్యా సామగ్రి, డిజిటల్ సదుపాయాలు వంటి అంశాలపై, పూర్తి స్థాయిలో పరిశీలన జరిపి, లోపాలన్నింటినీ దశలవారీగా పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపడుతున్నారు. విద్యా రంగంలో నాణ్యత పెరగాలంటే కేవలం భవనాల నిర్మాణమే కాకుండా,

మిగతా 2లో



# చినుకు పడితే చిత్తడే..! చిత్తడి..!!

- మంత్రి దామోదర రాజ నర్సింహా ఇలాఖలో రోడ్ల దుస్థితి
- చౌటకూర్--లక్ష్మీసాగర్ రహదారిని వెంటనే బాగు చేయాలని ప్రజల విజ్ఞప్తి
- వర్షాలతో కుంగిన ప్రధాన రహదారి, అంతా బురద మయం
- పెద్ద పెద్ద గుంతలతో నిత్యం పొంచి ఉన్న ప్రమాద భయం
- ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్న గుంతల రోడ్డు
- ప్రమాదం జరిగాక కాదు.. ముందే స్పందించాలి
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్న సమస్య
- చౌటకూర్--లక్ష్మీసాగర్ మార్గంపై ప్రజల ఆవేదన
- రోడ్డు దుస్థితితో వాహనదారుల ఇక్కట్లు పడుతున్న వైనం
- నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలి

8లో

# ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనాలు... రైతుల బెంబేలు

- బోర్ల ఆధారిత సాగులో వెంటాడుతున్న ట్రాన్స్ ఫార్మర్ల దొంగల బెడద
- వరుస దొంగతనాలతో ఆందోళనలో రైతులు
- పోలీసుల తక్షణ చర్యలు కోరుతున్న బాధితులు

2లో

# ఎస్ఐఆర్ ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణను పరిశీలించిన పరిగి బీజేపీ పార్టీ ఇంచార్జి మారుతి కిరణ్




**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ సర్ కార్యక్రమంలో భాగంగా, శుక్రవారం మండల ప్రవాస్ అభియాన్ సందర్భంగా పరిగి బిజెపి పార్టీ ఇన్చార్జి మారుతి కిరణ్ గోనేటి నాయకులతో కలిసి సమీక్షించారు. వికారాబాద్ జిల్లా పరిగి మండలంలోని లక్నాపూర్, మిట్ట కోడూర్, గోవిందపూర్, చిగుళ్లపల్లి, రాఘవపూర్, జాఫర్‌పల్లి,కడ్లపూర్,లక్ష్మీదేవిపల్లి, కుదవాన్పూర్, సయ్యద్‌పల్లి, రాపోల్, తొండపల్లి గ్రామాల్లో బీజేపీ పరిగి మండల అధ్యక్షురాలు శ్రీమతి అనసూయ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పరిగి మండల ప్రభారి బండలింటి రామచంద్రయ్య, పార్టీ బిఎల్‌ఏలు సంబంధిత బిఎల్‌ఓ లతో కలిసి ఓటరు జాబితాను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పారదర్శకంగా నిర్వహించబడాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అలాగే ప్రజలు తమ ఓటరు వివరాలను పరిశీలించి అవసరమైన చేర్పులు, మార్పులు, సవరణలు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలోలి బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ సర్ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ గేరింటి కేశవులు, బీజేపీ సీనియర్ నాయకులు దోమ రమేష్ కుమార్ గారు, శ్రీ నస్కల్ వెంకటయ్య,మల్లేష్, రవికుమార్ ,శ్యాంసుందర్ గారు, బీజేపీ యువ నాయకులు మనోహర్ గౌడ్,వివేకానంద, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, బి ఎల్ ఎ-2లు పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్

**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 31:** పటాన్‌చెరు నియోజకవర్గంలోని అమీన్‌పూర్ మండల పరిధిలో కిష్టారెడ్డిపేట, అశోక్‌నగర్ ప్రాంతాల్లో నిర్వహించిన బోనాల తొట్టెల ఊరేగింపు కార్యక్రమాల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ఎండీఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిష్టారెడ్డిపేట గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ ఏడుపాయల దుర్గమ్మ తల్లి దేవాలయంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవానికి హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం అశోక్‌నగర్ పరిధిలోని కాకతీయ నగర్‌లో జయ దుర్గ భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్నారు. యువకులతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో సందడి చేశారు. ఈ సందర్భంగా స్థానిక యువతతో కొంతసేపు ముచ్చటిస్తూ బోనాల పండుగను ఐక్యతకు, సాంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకగా అభివర్ణించారు.

## ట్రాన్స్ ఫార్మర్ల దొంగతనాలు... రైతుల బెంబేలు

**క్రైమ్ మిర్రర్,నేరేడుచర్ల** బోర్లు ఆధారిత సాగులో రైతుల ట్రాన్స్ ఫార్మర్లకు దొంగల బెడద వెంటాడుతోంది .నేరేడుచర్ల మండల పరిధిలో దొంగల కన్ను విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లపై పడింది. విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లలో ఉండే కాపర్, అల్యూమినియం వైర్ కోసం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లను చోరి చేస్తున్నారు.గత కొంత కాలంగా రైతుల వ్యవసాయ పంట పొలాల వద్ద ఏర్పాటు చేసుకున్న ట్రాన్స్ఫార్మాల విలువైన వస్తువులను దొంగలిస్తూ పోలీసులకు సవాల్ విసురుతున్నారు దొంగలు. నేరేడుచర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ మొదలైనప్పటికీ వర్షా బావ ప్రభావంతో ప్రాజెక్టులు నిండక పంట కాలువలకు నీరు రాకపోవడంతో ప్రత్యామ్నాయంగా నీటి సదుపాయం కోసం ఏర్పాటు చేసుకున్న బోర్లు బావుల మరమ్మతులు చేసుకొని వ్యవసాయాన్ని ముమ్మరం చేస్తున్న తరుణంలో దొంగలు ట్రాన్స్ఫార్మర్లను పగలగొట్టి విలువైన వస్తువులను అపహరించుకు వెళుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత కొంతకాలంగా ట్రాన్స్ఫార్మర్ల విడిభాగాలే లక్ష్యంగా దొంగలు చేస్తున్న ఈ బీభత్సంతో రైతులకు కష్టాలు వస్తున్నాయని పోలీసులు నిఘాను ముమ్మరం చేసి దొంగలను పట్టుకొని రైతుల పంటలను కాపాడాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి పోస్టర్‌ను విడుదల చేసిన బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి



**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** విద్యార్థులపై పెరుగుతున్న విద్యా ఫీజుల భారం, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా యువమోర్చా (బీజేవైఎం) తెలంగాణ చేపట్టిన “ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి” కార్యక్రమంలో భాగంగా రూపొందించిన పోస్టర్‌ను బీజేపీ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ శ్రీ మారుతి కిరణ్ బూనేటి శుక్రవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,రాష్ట్రంలోని వేలాది మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల చదువుకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయడంతో పాటు విద్యా ఫీజుల నియంత్రణపై స్పష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులు తమ అభిప్రాయాలను తెలియజేస్తూ ఈ ఉద్యమానికి మద్దతు ఇవ్వాలని, బీజేవైఎం చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ, బీజేవైఎం నిరంతరం పోరాటం చేస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పరిగి అసెంబ్లీ కన్వీనర్ ఉగ్ర నరసింహ, సర్ పరిగి అసెంబ్లీ ఇన్‌చార్జ్ గేరింటి కేశవులు గారు, బీజేపీ సీనియర్ నాయకులు దోమ రమేష్ కుమార్,నస్కల్ వెంకటయ్య, శ్రీనివాస్,శ్యాంసుందర్, బీజేవైఎం పరిగి పట్టణ అధ్యక్షులు సాయికుమార్, బీజేవైఎం నాయకులు అనిల్ కుమార్,మనోహర్ గౌడ్,వివేకానంద, బీజేవైఎం నాయకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తల పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న బిజెపి పార్టీ జిల్లా కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలలోని చాపల గూడెం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఆషాడ మాసం బోనాల పండుగ ఉత్సవాల్లో వికారాబాద్ జిల్లా బిజెపి కన్వీనర్ కరణం ప్రహ్లాద్ రావు పాల్గొని అమ్మవారిని దర్శించుకోవడం జరిగింది. బోనాల ఉత్సవాలలో మేళ తాళాలతో, పోతురాజుల విన్యాసాలతో, మహిళా తల్లుల బోనాలతో అంగరంగ వైభవంగా శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఉత్సవాలు జరిగాయి. గ్రామ సర్పంచ్ స్వప్న గోపాలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ బోనాల ఉత్సవ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు గాదె మహిపాల్ ముదిరాజ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ గడుసు మహిపాల్,ఉప సర్పంచ్ గండి అంజమ్మ సిద్ధయ్య,గుంటి సాయన్న,గండి శ్రీను, కుమ్మరి బాలరాజ్, గుంటి రాములు, కొండ యాదయ్య, బోరకొండ అంజిలయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు..

## మునుగోడులో విద్యా విప్లవానికి నాంది

బోధనా ప్రమాణాలు కూడా మెరుగుపడాలని ఎమ్మెల్యే భావిస్తున్నారు. విద్యార్థుల హాజరు శాతం పెరగడం, డ్రాప్‌అవుట్‌లను తగ్గించడం, పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంచడం, పోటీ పరీక్షలకు ప్రభుత్వ విద్యార్థులను సిద్ధం చేయడం వంటి అంశాలపై కూడా ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. అధికారులతో నిర్వహించే సమీక్షల్లో ప్రతి పాఠశాల పరిస్థితిపై విడివిడిగా చర్చించి, అత్యవసర సమస్యలను వెంటనే పరిష్కరించేలా కార్యాచరణ రూపొందించనున్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధుల సమీకరణపై, కూడా చర్చించే అవకాశం ఉందని తెలుస్తోంది. విద్యా వ్యవస్థ బలోపేతమే సమాజ అభివృద్ధికి పునాది అనే ఆలోచనతో, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముందుకు సాగుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంపై, ఆయన చూపుతున్న చొరవ వల్ల ప్రభుత్వ విద్యాసంస్థలకు కొత్త ఊపు వస్తుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. ఈ చర్యలు కార్యరూపం దాల్చితే మునుగోడు నియోజకవర్గం, విద్యారంగంలో ఆదర్శంగా నిలిచే అవకాశముందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.




## రోడ్డుపై కాదు.. చెత్త బండిలోనే వేయండి

**మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి**

**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని మణికొండ గార్డెన్ కాలనీలో పరిశుభ్రత పరిరక్షణే లక్ష్యంగా చెత్త నిర్వహణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటి నుంచి వచ్చే చెత్తను రోడ్లపై వేయకుండా తప్పనిసరిగా చెత్త బండిలోనే వేయాలని కాలనీవాసులకు సూచించారు. పరిసరాలను పరిశు భ్రంగా ఉంచడం ద్వారా వ్యాధుల వ్యాప్తిని అరికట్టడంతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నెలకొల్పవచ్చని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణ రెడ్డి మాట్లాడుతూ.. పరిశుభ్రమైన కాలనీ నిర్మాణంలో ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారం ఉంటేనే స్వచ్ఛమైన, ఆరోగ్యవంతమైన పరిసరాలను నెలకొల్పడం సాధ్యమవుతుందన్నారు. కాలనీ అధ్యక్షులు శ్రీనివాస్ చారి మాట్లాడుతూ.. చెత్తను రోడ్లపై వేయడం వల్ల దుర్వాసన, దోమల వ్యాప్తి, పారిశుద్ధ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ చెత్త బండినే వినియోగించి కాలనీ పరిశుభ్రతను కాపాడాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని పరిశు భ్రమైన పరిసరాల కోసం తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

## రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ ఎదుట ఉన్న ఛార్జింగ్ స్టేషన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. గురువారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. మృతుడి వయస్సు సుమారు 55 నుంచి 60 సంవత్సరాల మధ్య ఉండవచ్చని పోలీసులు తెలిపారు. ఆయన భిక్షాటన చేసుకుంటూ జీవించే వ్యక్తిగా ప్రాథమికంగా గుర్తించారు. అనారోగ్యం లేదా సరైన ఆహారం అందకపోవడం వల్ల మృతి చెందినట్లు ప్రాథమికంగా అనుమానిస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడిని ఎవరైనా గుర్తించినా లేదా అతనికి సంబంధించిన సమాచారం తెలిసినా ఆర్జీఐఏ పోలీస్ స్టేషన్‌ను 8712663319 నంబర్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

## తల్లిపాలు బిడ్డ ఆరోగ్యానికి అమృతం: జిల్లా వైద్య అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్

**ఆగస్టు 1 నుంచి 7 వరకు 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు'**

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో కరపత్రాలు,పోస్టర్ల విడుదల**



**మంచిర్యాల,జూలై 31 (క్రైమ్ మిర్రర్):** తల్లిపాలు శిశువుకు ప్రకృతి ప్రసాదించిన అమృతమని, ప్రతి తల్లి బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల పోస్టర్లు, కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉపకేంద్రాలు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ దవాఖానాలు, మాతా శిశు సంరక్షణ కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, జిల్లా ప్రభుత్వాసుపత్రి, అంగన్‌వాడీ కేంద్రాలు, జాతీయ టీకా కార్యక్రమ కేంద్రాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. వైద్యులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. బిడ్డకు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలు ఇవ్వడం అత్యంత కీలకమని, ఆరు నెలల పాటు తల్లిపాలు తప్ప ఇతర ఆహారం లేదా నీరు ఇవ్వకూడదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు. తల్లిపాలు పిల్లల్లో రోగనిరోధక శక్తిని పెంచి విరేచనాలు, నిమోనియా, అలర్జీలు, మధుమేహం వంటి వ్యాధుల నుంచి రక్షిస్తాయని చెప్పారు. అలాగే పిల్లల మేధో వికాసం, కంటిచూపు మెరుగుపడటంతో పాటు తల్లి,బిడ్డల మధ్య అనుబంధం మరింత బలపడుతుందని పేర్కొన్నారు. తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లులకు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ల ప్రమాదం తగ్గడంతో పాటు మధుమేహం, అధిక బరువు, మానసిక ఒత్తిడి తగ్గుతాయని వివరించారు. ప్రసవానంతరం రక్తస్రావాన్ని తగ్గించి గర్భాశయం త్వరగా సాధారణ స్థితికి రావడానికి తల్లిపాలు దోహదపడతాయని చెప్పారు. గర్భిణులకు ముందుగానే తల్లిపాల నిర్వహణకు సంబంధించిన 'విజయవంతమైన తల్లిపాల 10 సూత్రాల'పై అవగాహన కల్పించాలని, బిడ్డ అడిగిన ప్రతిసారీ తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విశ్వేశ్వర్ రెడ్డి, డీపీఓ ప్రశాంతి, బసుమతి, సుమన్‌తో పాటు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## మందమర్రి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ

**ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు.. నేరస్థులకు శిక్ష పడేలా దర్యాప్తు చేయాలి**



**మందమర్రి,జూలై 31 (క్రైమ్ మిర్రర్):** బాధితులకు రక్షణ, భద్రత కల్పించడమే పోలీసుల ప్రధాన బాధ్యత అని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్, బెల్లంపల్లి సబ్‌డివిజన్‌లోని మందమర్రి పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలతో పాటు వివిధ రికార్డులు, శాంతిభద్రతల నిర్వహణకు సంబంధించిన పత్రాలను పరిశీలించారు. అనంతరం అధికారులకు పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులను, పెండింగ్ కేసులను సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. సీసీటీఎన్ఎస్‌లో కేసుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. నేరస్థులకు శిక్షలు పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేపట్టి, కోర్టులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని చెప్పారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ నేరాల నివారణకు కృషి చేయాలని, సిబ్బంది నైపుణ్యాలను మెరుగుపర్చేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పోలీసు సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మందమర్రి సీఐ పి. రమేష్, ఎస్ఐ నరేష్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మృతికి ఎమ్మెల్యే జీఎంఆర్ సంతాపం

**తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలు చిరస్మరణీయం**

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**





**పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 31:** నర్సంపేట మాజీ శాసనసభ్యులు, తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం పట్ల పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో పెద్ది సుదర్శన్ రెడ్డి కీలక పాత్ర పోషించారని, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు అంకితభావంతో సేవలందించిన నాయకుడిగా ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని కొనియాడారు. పెద్ది సుదర్శన్ రెడ్డి మరణం బీఆర్ఎస్ పార్టీకి, తెలంగాణ రాజకీయాలకు తీరని లోటని ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# షాబాద్‌లో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్

**షాబాద్, క్రైమ్ మిర్రర్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగి, నకిలీ ఓట్లను తొలగించే లక్ష్యంతో బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్ఏలు) క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ 75 నుంచి 80 శాతం వరకు పూర్తయిందని, మిగిలిన మూడు రోజుల్లో పూర్తి స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ముగించేందుకు బీజేపీ శ్రేణులు కృషి చేస్తున్నాయని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించిన రాజ్ భూపాల్ గౌడ్, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ ఎన్నికల హామీలను పూర్తిగా అమలు చేయలేదని ఆరోపించారు. ప్రస్తుతం ఎన్నికలు నిర్వహిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి డిపాజిట్ కూడా దక్కదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ప్రజల్లో బీజేపీపైనే విశ్వాసం పెరుగుతోందని, భవిష్యత్తులో రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడుతుందని ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు బకాయిల సమస్యపై రాష్ట్రవ్యాప్తంగా "ఫీజు బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి, విద్యారంగానికి తగిన నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లా, షాబాద్ ప్రాంతంలో పరిశ్రమలకు ప్రభుత్వ భూములు



కేటాయించినప్పటికీ స్థానిక యువతకు తగిన ఉద్యోగ అవకాశాలు కల్పించలేదని ఆరోపించారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య తరచూ పార్టీలు మారుతున్నారని విమర్శిస్తూ, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. అలాగే సీజేపీ పార్టీ, రోహింగ్యాల అంశాలపై కూడా తన అభిప్రాయాలను వెల్లడించారు. హైదరాబాద్‌లో ఉన్న రోహింగ్యాల ఓటర్ల అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టామని, ఈ విషయమై పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి కావలి శ్రీశైలం, జిల్లా కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, జిల్లా యువ నాయకుడు తాళ్ల నవీన్ గౌడ్, మండల అధ్యక్షుడు మద్దూరి మానయ్య, విజయ్ కుమార్, నర్సింలు గౌడ్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శాకాంబరి దేవీగా వాసవీమాత కూరగాయల అలంకరణతో దర్శనం

### భక్తిశ్రద్ధలతో ఆషాఢ మాసం వేడుకలు

**వనపర్తి జులై 31 క్రైమ్:** వనపర్తి జిల్లా పెబ్బేరు పట్టణంలోని శ్రీశ్రీశ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆషాఢ మాసం మూడో శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని శాకాంబరి దేవీ కూరగాయల అలంకరణలో విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దీంతో ఆలయం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. ఆలయ అర్చకులు కిట్టు స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజామునే అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మహా మంగళహారతి సమర్పించారు. ఆషాఢ మాసంలో శాకాంబరి దేవీ అలంకరణకు ఉన్న ప్రత్యేకతను దృష్టిలో ఉంచుకుని పట్టణ ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున కూరగాయలను ఆలయానికి తీసుకువచ్చారు. వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారి ఉత్సవమూర్తిని అత్యంత సుందరంగా అలంకరించారు. ముఖ్యంగా ఆర్యవైశ్య మహిళలు, యువతులు భక్తిశ్రద్ధలతో పాల్గొని కూరగాయలను కళాత్మకంగా అమర్చి చిన్నమ్మవారికి శాకాంబరి దేవీ రూపాన్ని తీసుకువచ్చారు. కూరగాయలతో చేసిన ప్రత్యేక అలంకరణ భక్తులను విశేషంగా



ఆకట్టుకుంది. అమ్మవారి దర్శనం కోసం వచ్చిన భక్తులు అలంకరణను వీక్షిస్తూ ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. సాయంత్రం ఆలయంలో ప్రత్యేకంగా కుంకుమార్చన, లలితా సహస్రనామ పారాయణం, వాసవి మాతా పారాయణం నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని పల్లకిలో కొలువుదీర్చి ఆలయ పరిసరాల్లో పల్లకీసేవ నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి మహా మంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు ఆషాఢ మాసం, శాకాంబరి దేవీ అలంకరణకు ఉన్న ఆధ్యాత్మిక ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. ప్రకృతి, పంటలు, ఆహార సమృద్ధికి ప్రతీకగా శాకాంబరి దేవిని ఆరాధించడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో మహిళలు, యువతులు, ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు, భక్తులు విజయవంతం చేశారు

# ఎడిఫై ఇంటర్నేషనల్ స్కూల్‌లో ట్రాఫిక్ అవగాహన కార్యక్రమం

### 'అరైవ్ అలైవ్'లో భాగంగా విద్యార్థులకు రహదారి భద్రతపై సూచనలు

**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్‌లోని ఎడిఫై ఇంటర్నేషనల్ స్కూల్‌లో 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ పోలీసులు విద్యార్థులకు రహదారిని సురక్షితంగా దాటే విధానం, ట్రాఫిక్ సంకేతాల ప్రాముఖ్యత, జీబ్రా క్రాసింగ్ వినియోగం, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, నాలుగు చక్రాల వాహనాల్లో సీటు బెల్టు వినియోగం, మైనర్లు వాహనాలు నడపరాదనే అంశాలపై వివరంగా అవగాహన కల్పించారు. రహదారి భద్రతా నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించి విలువైన ప్రాణాలను కాపాడవచ్చని అధికారులు తెలిపారు. విద్యార్థులు తాము నేర్చుకున్న ట్రాఫిక్ నియమాలను తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు తెలియజేసి సమాజంలో రహదారి భద్రతపై మరింత అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల్లో చిన్న వయస్సు నుంచే రహదారి భద్రతపై బాధ్యతాయుతమైన అవగాహన పెంపొందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, ట్రాఫిక్ పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# తప్పిపోయిన ఇద్దరు బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** బాబుల్ రెడ్డి నగర్‌కు చెందిన అన్షు, ముస్కాన్ అనే ఇద్దరు బాలికలు తప్పిపోయిన ఘటనలో పోలీసులు వారిని గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం శంషాబాద్ పోలీసు స్టేషన్‌లో పోలీసుల సమక్షంలో కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్. వెంకటేష్, జగన్ సురేష్ సమక్షంలో బాలికలను వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా ఎస్. వెంకటేష్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, వారి రాకపోకలు, స్నేహాలు, రోజువారీ కార్యకలాపాలపై నిరంతరం దృష్టి పెట్టాలని సూచించారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా అనుకోని సంఘటనలకు దారితీసే అవకాశం ఉంటుందని, పిల్లల భద్రత విషయంలో ప్రతి కుటుంబం బాధ్యతగా వ్యవహరించాలని ఆయన అన్నారు.

# కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మూగ, చెవిటి విద్యార్థులకు అల్పాహార సేవ

**క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్ , జూలై 31:** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో, హైదరాబాద్‌కు చెందిన సామాజిక సేవకులు ఆనంద్ జైన్ సహకారంతో శుక్రవారం మూగ మరియు చెవిటి పిల్లల పాఠశాలలో అల్పాహార పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సేవా కార్యక్రమంలో సమితి అధ్యక్షులు డా. కపిల్ కుమార్ అగర్వాల్‌తో పాటు సమితి సభ్యులు, అధికారులు పాల్గొని చిన్నారులకు ప్రేమతో అల్పాహారం అందించారు. విద్యార్థులు ఆనందంగా అల్పాహారాన్ని స్వీకరించగా, పాఠశాల నిర్వాహకులు సేవా సమితికి, దాత ఆనంద్ జైన్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి ఒక్కరూ అన్నదానం, అల్పాహార పంపిణీ, విద్యా మరియు ఇతర సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆసక్తి ఉన్న దాతలు, సేవాభావం కలిగిన వారు కృష్ణ గోపాల్ సేవా సమితి సంప్రదింపు నంబర్ ద్వారా వివరాలు తెలుసుకుని సేవా కార్యక్రమాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ?





# వనమహోత్సవం సందర్భంగా ఉచిత మొక్కల పంపిణీ

**ప్రతి కుటుంబానికి ఐదు మొక్కలు అందజేయనున్న హెచ్ఎండీఏ**

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** వనమహోత్సవం--2026 సందర్భంగా హెచ్ఎండీఏ అర్బన్ ఫారెస్ట్రీ విభాగం, కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) కార్యక్రమం ఆధ్వర్యంలో ఆగస్టు 1న నెక్లెస్ రోడ్ నర్సరీ మేళా ప్రాంగణంలో ఉచిత మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో పాల్గొనే ప్రతి కుటుంబానికి ఐదు ఉచిత మొక్కలను అందజేయనున్నారు. వీటిలో పండ్ల, ఔషధ, అలంకరణ మొక్కలు ఉంటాయని అధికారులు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో ఇంటి తోటల అభివృద్ధిని ప్రోత్సహించడం, పర్యావరణ పరిరక్షణ, హరితాభివృద్ధి, భూగర్భ జలాల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణకు ప్రజలను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని హెచ్ఎండీఏ పేర్కొంది. సిటీ టెర్రస్ గార్డెనర్స్ సంస్థ సహకారంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో పౌరులు, పర్యావరణ ప్రేమికులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ల ప్రతినిధులు, విద్యార్థులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను స్వీకరించి సంరక్షించాలని హెచ్ఎండీఏ విజ్ఞప్తి చేసింది.

# గుంతలమయమైన రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

**గంధంగూడ ఫీల్ గుడ్ హోమ్స్ కాలనీలో వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్**

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధి గంధంగూడలోని ఫీల్ గుడ్ హోమ్స్ కాలనీలో రహదారులు పూర్తిగా గుంతలమయంగా మారడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ అధ్యక్షుడు రావులకోళ్ళ నాగరాజ్ ఆరోపించారు. కాలనీవాసుల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించినట్లు తెలిపారు. జనావాసాల మధ్య ఉన్న రహదారులు అధ్వాన్నంగా మారినా, పలుమార్లు జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. 121, 122, 123 డివిజన్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొని ఉందని పేర్కొంటూ, తక్షణమే గుంతలను పూడ్చే పనులు చేపట్టి, అనంతరం శాశ్వత రహదారుల నిర్మాణాన్ని ప్రారంభించాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కోరారు. ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకపోతే స్థానిక ప్రజలతో కలిసి భారీ ఎత్తున మున్సిపల్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రస్తుత పాలనలోనూ ప్రజల సమస్యలకు ఆశించిన స్థాయిలో పరిష్కారం లభించడం లేదని ఆరోపించిన నాగరాజ్, ప్రభుత్వం, జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి గంధంగూడతో పాటు పరిసర ప్రాంతాల రహదారి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..



# నాథన్ బౌలింగ్ మెరుపు.. కీర్తన చిత్రలేఖనంలో ప్రతిభ

**ఇన్‌ఫెంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థుల ద్వంద్వ విజయం**

**విజేతలను అభినందించిన చైర్మన్, ప్రిన్సిపాల్**




**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** శంషాబాద్ సమీపంలోని ఇన్‌ఫెంట్ జీసస్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు క్రీడలు, కళారంగాల్లో విశేష ప్రతిభ కనబర్చి పాఠశాలకు మరోసారి గుర్తింపు తీసుకొచ్చారు. గోవాలో నిర్వహించిన 16 ఏళ్లలోపు అంతర్ రాష్ట్ర ఇరవై ఓవర్ల క్రికెట్ పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థులు మెరుగైన ప్రదర్శన కనబర్చగా, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సాంకేతిక ధ్రువపత్ర చిత్రలేఖన పరీక్షలో విద్యార్థిని కీర్తన ప్రతిభ కనబర్చి ధ్రువపత్రం సాధించింది. క్రికెట్ పోటీల్లో విద్యార్థి ఈ. నాథన్ తన అద్భుత బౌలింగ్‌తో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. మహబూబ్‌నగర్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కేవలం ఏడు పరుగులు మాత్రమే ఇచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. అనంతరం తొండపల్లి బ్రదర్స్ అకాడమీతో జరిగిన మ్యాచ్‌లోనూ మరో నాలుగు వికెట్లు సాధించి తన ప్రతిభను మరోసారి చాటుకున్నాడు. టోర్నీ మొత్తం అతని నిలకడైన ప్రదర్శనకు శిక్షకులు, క్రీడాభిమానులు ప్రశంసలు కురిపించారు. మరోవైపు విద్యార్థిని కీర్తన తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన సాంకేతిక ధ్రువపత్ర చిత్రలేఖన పరీక్షలో ప్రతిభ కనబర్చి ధ్రువపత్రం సాధించింది. చిత్రలేఖనంలో తన సృజనాత్మకత, నైపుణ్యాన్ని ప్రదర్శించి పాఠశాలకు గౌరవం తీసుకొచ్చింది. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్, ప్రిన్సిపాల్ ఫాదర్ అమర్ ఫ్రాన్సిస్, ఫాదర్ కిషోర్ విజేతలను అభినందించారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, కళారంగాల్లోనూ రాణించడం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగితే రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించవచ్చని తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసి అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు పాఠశాల ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోందని తెలిపారు. నాథన్, కీర్తన సాధించిన విజయాలు ఇతర విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తాయని, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు, తెలంగాణకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు.

# పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలి

**తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాష డిమాండ్**

**సంగారెడ్డి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ధర్నా**



**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 31:** జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి ఎమ్మార్వో కార్యాలయం ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాష మాట్లాడుతూ.. రాష్ట్రంలోని వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 8,500 స్కాలర్‌షిప్‌లను తక్షణమే విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల కాకపోవడంతో విద్యార్థుల చదువులు దెబ్బతింటున్నాయని, ఉన్నత విద్య కొనసాగించేందుకు అనేక కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయిబాష, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు ప్రదీప్ గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ పటేల్, మహేష్, వినోద్ యాదవ్, నాని, రోహిత్, పవన్, భరత్తో పాటు పలువురు విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తా..

**-కల్వకుర్తి మున్సిపల్ చైర్ పర్సన్ బృంగి రత్నమాల**




**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని వివిధ వార్డుల ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులకు తక్షణమే స్పందించేందుకు కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ప్రత్యేక చొరవలు తీసుకుంటున్నారు. ఈనెల 30న ఇన్‌స్టాగ్రామ్‌లో కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్ రూం కాలనీకి చెందిన ఓ వ్యక్తి ప్రజా సమస్యలపై మెసేజ్ చేయగా దానిపై మున్సిపాలిటీ చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ వెంటనే డబుల్ బెడ్ రూం కాలనీని సందర్శించి సమస్యలను పరిష్కరించారు. మున్సిపాలిటీ ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఎవరైనా సోషల్ మీడియా ద్వారా అయినా, నేరుగా వచ్చి అయినా ఫిర్యాదు చేస్తే తప్పకుండా పరిష్కరిస్తానని ప్రతి వార్డులో మౌలిక సదుపాయాలు అందేలా ప్రత్యేక చొరవ తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్ పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ వెంట స్థానిక కౌన్సిలర్ షేక్ ఏజాస్, సిఐటియు జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, యువజన కాంగ్రెస్ నాయకుడు దున్న సురేష్, తదితరులు ఉన్నారు.

# ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ.. నలుగురికి తీవ్ర గాయాలు





**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల పరిధిలోని నాగర్‌గూడ ఎక్స్ రోడ్డు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. షాద్‌నగర్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును శంషాబాద్ వైపు నుండి వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ప్రమాదం జరిగే సమయంలో బస్సులో సుమారు 15 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా, మరికొంతమందికి స్వల్ప గాయాలయ్యాయి.గాయపడిన వారి వివరాలు చేవెళ్ల మండలం దేవరంపల్లి గ్రామానికి చెందిన నామ మమత, షాబాద్ మండలం సుల్తాన్ పల్లి గ్రామానికి చెందిన శిరీషలతో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి.

**సహాయక చర్యలు ಡ చికిత్స:**

ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులను సమీపంలోని నాగర్‌గూడ శ్రీనివాస ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అక్కడ వారికి వైద్య చికిత్స అందిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య కొడుకు మొయినాబాద్ జడ్పిటిసి కాలే శ్రీకాంత్ శ్రీనివాస హాస్పిటల్ కి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించాడు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించాడు. ఆయనతోపాటు చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మధుసూదన్ గుప్తా ఉన్నారు.. చేవెళ్ళ లోని పరిధిలోని మారని డ్రైవర్ల తీరు అతివేగమే కారణం నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో భయాందోళనలో ప్రయాణికులు, స్థానికులు. నెమ్మదిగా వెళ్లాలని అధికారులు, స్థానికులు చెప్పినా పెడచెవిన పెడుతున్న ఆర్టీసీ డ్రైవర్లు. పెరుగుతున్న ప్రాణనష్టం: తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి.ప్రయాణికులకు సురక్షిత ప్రయాణాన్ని అందించాల్సిన ఆర్టీసీ బస్సులు కొన్ని చోట్ల మృత్యురథాలుగా మారుతున్నాయి.నిత్యం ఎక్కడో ఒకచోట బస్సు ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ, డ్రైవర్ల ప్రవర్తనలో మాత్రం మార్పు రావడం లేదు.అధికారుల ఆదేశాలను, స్థానికుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ కొందరు డ్రైవర్లు అంతులేని అతివేగంతో బస్సులను నడుపుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

# విద్యతో పాటు విద్యార్థులకి వసతులు కల్పించాలి : డిపిఓ తరుణ్ చక్రవర్తి



**విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు**

**మహాత్మా జ్యోతిబాపూలే బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ**

**డిపిఓ వనం తరుణ్ చక్రవర్తి**

**మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు తనిఖీ చేయాలి**

**ఎంపిడిఓ కార్యాలయంలో డిపిఓకు ఘన సన్మానం**

**మునుగోడు క్రైమ్ మిర్రర్ జూలై 31:** పాఠశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలిగించొద్దు అని జిల్లా పంచాయతీ అధికారి వనం తరుణ్ చక్రవర్తి అన్నారు.మునుగోడు మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలికల గురుకుల పాఠశాలను జిల్లా పంచాయతీ అధికారి వనం తరుణ్ చక్రవర్తి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని పలు రికార్డులను, రిజిస్టర్లను ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యమైన విద్యతో పాటు వసతులు సరిగ్గా అందేలా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

పాఠశాల తనిఖీ అనంతరం స్థానిక ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా పంచాయతీ అధికారి వనం తరుణ్ చక్రవర్తిని మండల అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.మండల అధికారులు,ప్రజాప్రతినిధులు పాఠశాలను తనిఖీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ పి వెంకటేశ్వర్



రెడ్డి,మండల విద్యాధికారి తల్లమల్ల మల్లేశం,మండల పంచాయతీ అధికారి కేదార్నాద్,సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్,ప్రిన్సిపల్ సంధ్యారాణి,గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ రెడ్డి,వివిధ గ్రామాల కార్యదర్శులు,పాఠశాల సిబ్బంది, మండల స్థాయి అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## బోనాలు, రోడ్డు సమస్యలపై డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డికు వినతిపత్రం



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** బోనాల పండుగ ఏర్పాట్లతో పాటు సౌభాగ్యనగర్ కాలనీలో నెలకొన్న రహదారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంబేద్కర్ యూత్ అసోసియేషన్ హైదర్షాకోట్ ప్రతినిధులు రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వై. చరణ్ కుమార్, అడ్వైజర్ కె. విష్ణు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎల్. గౌతమ్ రాజ్, ఇతర సభ్యులు డిప్యూటీ కమిషనర్‌తో సమావేశమై బోనాల పండుగ సందర్భంగా అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు స్వోభాగ్య నగర్ కాలనీలోని రహదారి సమస్యలను వివరించారు. వినతిపత్రంపై స్పందించిన డిప్యూటీ కమిషనర్, సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రతినిధులు తెలిపారు.

## రాజేంద్రనగర్ నూతన స్టేషన్ హౌస్ అధికారికి బీజేపీ నేతల సన్మానం




**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్‌కు నూతనంగా నియమితులైన స్టేషన్ హౌస్ అధికారి ఆర్. వెంకటేశ్‌ను భారతీయ జనతా పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ నారగూడెం మల్లారెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేపీ కార్యదర్శి పొన్నమోని మల్లేష్ యాదవ్, రంగారెడ్డి జిల్లా కార్యాలయ కార్యదర్శి సాబాద విజయ్ కుమార్, రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు కాకులారం కృష్ణ కిట్టు, అత్తాపూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు స్టార్ చిన్న శ్రీనివాస్ కలిసి ఆర్. వెంకటేశ్‌ను శాలువాతో సత్కరించారు. నూతన బాధ్యతల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆకాంక్షించారు. ఆయన పదవీకాలం విజయవంతంగా సాగాలని కోరుతూ తమ శుభాకాంక్షలు తెలియజేశారు.

## పదవీ విరమణ పొందిన పోలీసు అధికారికి ఘన సన్మానం



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** ఆర్‌జీఐ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గత సంవత్సరకాలంగా పోలీసు అధికారిగా విధులు నిర్వహించిన మహమ్మద్ నూరుద్దీన్ శుక్రవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి మహమ్మద్ నూరుద్దీన్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పోలీసు శాఖలో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ, విధి నిర్వహణలో చూపిన క్రమశిక్షణ, అంకితభావం సహోద్యోగులకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షిస్తూ, పోలీసు అధికారులు, సిబ్బంది మహమ్మద్ నూరుద్దీన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.



## ఎస్ఐఆర్ కార్యక్రమంలో పెండింగ్ దరఖాస్తుల పరిశీలన పూర్తి

**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** నార్సింగి సర్కిల్ పరిధిలోని ఖానాపూర్‌లో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా బీఎల్‌వోలు గోదా మంజుల, రవీందర్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ బీఎల్ఏలు కలిసి పెండింగ్‌లో ఉన్న ఎస్ఐఆర్ దరఖాస్తులను పరిశీలించారు. ఫారాలు పూర్తి చేయని ఓటర్లను ఫోన్ ద్వారా సంప్రదించి అవసరమైన వివరాలు సేకరించి కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్దపల్లి కిషన్, తలారి మైకృష్ణ, డప్పు రాకేష్, వై. ప్రకాష్, ఆర్. దేవదాస్, డప్పు రవీందర్, సీహెచ్. యాదయ్య, దాకూరి వంశీతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**క్రైమ్ మిర్రర్ షాబాద్:** తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి తల్లి రుక్కమ్మ మృతి పట్ల టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పట్నం మహేందర్ రెడ్డి నివాసానికి మహేష్ కుమార్ గౌడ్ వచ్చి రుక్కమ్మ చిత్రపటానికి పువ్వులతో నివాళులర్పించారు. అనంతరం పట్నం మహేందర్ రెడ్డి మరియు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. రుక్కమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



ఏఐసీసీ -విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు - **(బాలాపూర్ క్రైమ్ మిర్రర్)**

# సీజన్ వ్యాధులను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు జాగ్రత్తపడాలి

### వనపర్తి అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్



**వనపర్తి జులై 31 క్రైమ్ మిర్రర్:** జిల్లాలో ప్రతి వారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజల సహకారంతో డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను నివారించాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఖీమ్యా నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా అదనపు కలెక్టర్ పెబ్బేర్ మున్సిపాలిటీలోని 7వ వార్డుతో పాటు పెబ్బేర్ మండలంలోని బునియాదిపూర్ గ్రామాన్ని సందర్శించి పారిశుద్ధ్య కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వీధులు, డ్రైనేజీలు, నివాస ప్రాంతాలను పరిశీలిస్తూ వర్షాకాలంలో ప్రజలు తీసుకోవాల్సిన ఆరోగ్య, పారిశుద్ధ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో పాత్రలు, కూలర్లు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, ఇతర వ్యర్థ వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల నివారణ మందులను పిచికారీ చేయడం, డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రపరచడం, పిచ్చి మొక్కలను తొలగించడం, ఎక్కడా మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే వేయడం, పరిశుభ్రతను దైనందిన జీవన విధానంలో భాగంగా చేసుకోవడం ద్వారా డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులను సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. గ్రామాలు, పట్టణాలను వ్యాధి రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. అనంతరం బునియాదిపూర్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించి అక్కడి నిర్వహణ, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించి సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, మున్సిపల్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి డీపీఓ ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శి, వార్డు కౌన్సిలర్లు, వైద్య శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు. మున్సిపల్ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# చినుకు పడితే చిత్తడే..! చిత్తడి..!!

- మంత్రి దామోదర రాజ నర్సింహా ఇలాఖలో రోడ్ల దుస్థితి
- చౌటకూర్--లక్ష్మీసాగర్ రహదారిని వెంటనే బాగు చేయాలని ప్రజల విజ్ఞప్తి
- వర్షాలతో కుంగిన ప్రధాన రహదారి, అంతా బురద మయం
- పెద్ద పెద్ద గుంతలతో నిత్యం పొంచి ఉన్న ప్రమాద భయం
- ప్రయాణికులకు చుక్కలు చూపిస్తున్న గుంతల రోడ్డు
- ప్రమాదం జరిగాక కాదు.. ముందే స్పందించాలి
- శాశ్వత మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తుల డిమాండ్
- ప్రతి వర్షాకాలంలో పునరావృతమవుతున్న సమస్య
- చౌటకూర్--లక్ష్మీసాగర్ మార్గంపై ప్రజల ఆవేదన
- రోడ్డు దుస్థితితో వాహనదారుల ఇక్కట్లు పడుతున్న వైనం
- నిధులు మంజూరు చేసి వెంటనే పనులు ప్రారంభించాలి







**సంగారెడ్డి, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 31:** సాక్షాత్తూ రాష్ట్ర మంత్రి తన ఆందోలు నియోజకవర్గ పరిధిలోని రోడ్ల పరిస్థితి మరీ అధ్వానంగా తయారు అయ్యింది. సంగారెడ్డి జిల్లా లోని చౌటకూర్ నుంచి పోసానిపల్లి, బొమ్మారెడ్డిగూడెం మీదుగా లక్ష్మీసాగర్ గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి ఇటీవల కురిసిన భారీ వర్షాలతో పూర్తిగా దెబ్బతింది. రహదారి అంతటా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడటంతో వాహనదారులు, ద్విచక్రవాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలను తప్పించుకునే క్రమంలో వాహనాలు అదుపుతప్పే ప్రమాదం నెలకొనగా, ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ మార్గంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో రహదారి పరిస్థితి రోజురోజుకూ మరింత దిగజారుతోందని, పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశముందని ప్రజలు పేర్కొంటున్నారు. వెంటనే మంత్రి దామోదర రాజ నర్సింహా స్పందించి సంబంధిత అధికారులతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టించడంతో పాటు శాశ్వతంగా రహదారిని పునరుద్ధరించే చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. మంత్రి దామోదర రాజ నర్సింహా ఈ రహదారిపై ఒక్కసారి ప్రయాణిస్తే ప్రజల కష్టం అర్థమవుతుందని బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత కాదు... జరగకముందే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. చౌటకూర్--లక్ష్మీసాగర్ రహదారికి వెంటనే నిధులు మంజూరు చేసి శాశ్వత పరిష్కారం చూపండని మంత్రి ని ప్రజలు కోరుతున్నారు. ప్రతి వర్షాకాలంలో ఇదే సమస్య పునరావృతం కాకుండా నాణ్యమైన రహదారి నిర్మించాలని ప్రజల నుండి డిమాండ్ వినిపిస్తుంది.

# షాబాద్‌లో మండల స్థాయి సమీక్ష,సామర్థ్య వృద్ధి శిక్షణ సమావేశం

**అభివృద్ధి పనులు వేగవంతం చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి:గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి**




**క్రైమ్ మిర్రర్ షాబాద్:** రంగారెడ్డి జిల్లా షాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన మండల స్థాయి సమీక్ష మరియు సామర్థ్య వృద్ధి శిక్షణ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలో అమలవుతున్న వివిధ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలు, ప్రభుత్వ పథకాల అమలు, గ్రామ పంచాయతీల పనితీరు, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనుల పురోగతి వంటి అంశాలపై అధికారులతో చర్చించారు. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.... ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హులైన లబ్ధిదారునికి పారదర్శకంగా చేరేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అభివృద్ధి పనులను నాణ్యతతో పాటు నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. సామర్థ్య వృద్ధి శిక్షణ కార్యక్రమం ద్వారా గ్రామస్థాయి ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ నిబంధనలు, పథకాల అమలు విధానంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, ఆ అవగాహనను గ్రామాల అభివృద్ధికి ఉపయోగించాలని ఆయన పేర్కొన్నారు. అధికారులు కూడా తమ తమ శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలు, లక్ష్యాలు, అమలు విధానంపై సమావేశంలో వివరించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పరస్పర సహకారంతో పనిచేస్తే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, ఎంపీడీవో అపర్ణ, స్పెషల్ ఆఫీసర్ వెంకటనారాయణ, డీఎల్పీఓ సతీష్ రెడ్డి, మండలంలోని సర్పంచులు, ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మండల సర్వసాధారణ సమావేశమా లేక రాజకీయ సమావేశమా?

**నిబంధనలు పాటించని ఎంపీడీవో పై పలువురి అసంతృప్తి...**



**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి జిల్లా ప్రతినిధి ):** మాడ్గుల మండల కేంద్రం లో వున్నా రైతు వేదికలో శుక్రవారం మండల సర్వసాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విజయలక్ష్మి ఎజెండా అంశాలతో కూడిన లెటర్ ద్వారా గ్రామాలలో ఇటీవల ఎన్నికైన సర్పంచులకు, ఎమ్మెల్యే, ఎంపీ, ఇతరత్రా డివిజన్ స్థాయి మండల స్థాయి అధికారులకు సమాచారం ఇచ్చిన ఎంపీడీవో విజయలక్ష్మి శుక్రవారం జరిగిన సమావేశం అందుకు విరుద్ధంగా జరగడం పట్ల పలువురు విమర్శలు గుప్పించారు. సర్వ సాధారణ సమావేశం అంటే కేవలం ప్రజల చేత ఎన్నుకోబడిన సర్పంచులు, వివిధ స్థాయిలలో పనిచేసే అధికారులు ఉద్యోగులు పాల్గొనాల్సి ఉండగా శుక్రవారం జరిగిన సమావేశంలో సర్పంచుల భర్తలు, ఉపసర్పంచులు, మహిళలు ఉన్నచోట వారి భర్తలు, వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న నాయకులు పాల్గొన్నా ఎంపీడీవో ఎవ్వరిని వారించకుండా సభ నిర్వహణ వల్ల గందరగోళ పరిస్థితులు ఎవరి ఇష్టానుసారం వారు మాట్లాడటం చర్చనీయాంశంగా మారింది. వార్తలను సేకరించే పత్రిక విలేకరులకు సమావేశ నిర్వహణపై కనీస సమాచారం సైతం ఇవ్వలేదని, అయినా ఇద్దరు ముగ్గురు విలేకరులు సమావేశం వద్దకు వెళితే కనీసం వారికి లోపలికి వెళితే కూర్చోవడానికి కుర్చీలు సైతం లేకపోవడం గమనార్హం. సర్వసాధారణ సమావవేశాన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్వహించడంతోపాటు రాజకీయ సభగా నిర్వహించడం ఏమిటని అధికారుల వైఖరిపై జిల్లాస్థాయి అధికారులు చొరవ చూపాలని పలువురు కోరారు.

# మునుగోడులో హలో మాల.. చలో నల్లగొండ  పాంప్లేట్ రిలీజ్



**మునుగోడు క్రైమ్ మిర్రర్ జూలై 31 :** రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న వర్గీకరణను రద్దు చేయాలని డిమాండ్ తో ఆగస్టు 8 వ తేదీన నల్లగొండ క్లాక్ టవర్ సెంటర్ లో జాతీయ మాలమహానాడు ఆధ్వర్యములో చేపట్టనున్న మహా ధర్నా,హలో మాల చలో నల్లగొండ,,పాంప్లేట్ ను మునుగోడు మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో మాలమహానాడు నాయకులు రిలీజ్ చేశారు..మాలలు అంత సంఘటితమై పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపు నిచ్చారు.మాల మహానాడు నాయకులు బొల్లు సైదులు,బెల్లపు బాలశివరాజు, పెరుమాళ్ల ప్రణయ్ కుమార్,ముచ్చపోతుల తరుణ్,గాలి సైదులు, పెరుమాళ్ల శ్రీరామ్ కుమార్, ఏం వైష్ణవ్ ప్రసాద్,గాలి జీవన్,,బెల్లపు ప్రసాద్, మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను మరింత వేగవంతంగా చేయండి : యేల్మెటి అమరేందర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతం చేసి పర్సెంటేజీని పెంచడానికి ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ మరియు ఇంటింటి సర్వేను వేగవంతంగా చేయాలంటూ బిఎల్ఏ లకు సూచించిన కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ పరిశీలకులు యేల్మెటి అమరేందర్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజికవర్గంలోని బాలాపూర్, బడంగ్‌పేట్, నాదర్‌గుల్, మీర్‌పేట్, జిల్లెల్గూడ మరియు ప్రశాంతి హిల్స్ డివిజన్ లకు సంబంధించి సర్ ప్రక్రియపై కాంగ్రెస్ పార్టీ మహేశ్వరం నియోజకవర్గ పరిశీలకులు యేల్మెటి అమరేందర్ రెడ్డి సమావేశం నిర్వహించారు. ఆగస్ట్ 3వరకు చేపట్టే ఓటరు సవరణ ప్రక్రియలో తప్పకుండ పని చేయడంతో పాటు, మీ బూతులలో ఇంటి పెద్ద ఫోన్ నంబర్, ట్రాన్స్‌ఫర్ అయిన ఓట్ల వివరాలు, చనిపోయిన వారి డేటాను ఖచ్చితంగా బిఎల్ఓల దగ్గర సేకరించాలని, ఇప్పటి వరకు ఆన్‌లైన్ అయిన వివరాలను తెలుసుకోవడంతోపాటు, అందరూ సమన్వయంతో పని చేయాలని అమరేందర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, డివిజన్ అధ్యక్షులు చల్లా బాల్ రెడ్డి, సిద్దాల శ్రీశైలం, బంగారు అశోక్, సామిడి గోపాల్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు బాలు నాయక్, చిక్కుల శివప్రసాద్, రావుల లింగం, వంగేటి మధుసూదన్ రెడ్డి, గుండోజి వెంకట్ చారి, కొండ శ్రీధర్ రెడ్డి, గుండ్ల కోమరయ్య, చింతపట్ల పవన్, రాజు నాయక్, గిరి నాయక్, వారికుప్పల సురేష్, యువ నాయకులు రాఘవేంద్ర, నితీష్ మరియు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# బాల సదన్‌లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆకస్మిక తనిఖీ

**సంగారెడ్డి,క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జూలై 31:** జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల ప్రకారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచనల మేరకు సంగారెడ్డిలోని బాల సదన్‌ను జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాల సదన్‌లోని విద్యార్థుల సంక్షేమం, సంరక్షణ, వసతి, పరిశుభ్రత, ఆహార నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు. పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో ఉండడంతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆమె తెలిపారు. విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను కూడా పరిశీలించారు. అలాగే, న్యాయ సంబంధిత సమస్యలు ఎదురైన వారికి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని, అవసరమైన వారు సంగారెడ్డి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని బి. సౌజన్య సూచించారు.

